# మాగంటి రోడ్‌షోకు విశేష స్పందన..

ఎర్రగడ్డ, నవంబర్ 8: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి బోరబండలో నిర్వహించిన రోడ్‌షోకు విశేష స్పందన లభించింది. భారీ వర్షం కారణంగా గంటన్నర పాటు ఆలస్యంగా ఈ రోడ్‌షో సాగింది. డివిజన్‌లోని సైట్–3, సైట్–4, సైట్–5 కాలనీల్లో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా స్థానికులు మాగంటి రోడ్‌షోకు స్వాగతం పలికారు. మైనార్టీలు అధిక సంఖ్యలో ఉండే ఈ కాలనీల్లో అన్ని వర్గాల వారు గోపీనాథ్‌కు అండగా ఉంటామని తెలుపుతూ నినాదాలు చేశారు. వారిని ఉద్దేశించి మాగంటి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎన్ఆర్ఆర్ పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన ఇండ్ల థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ అంశాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, కోఆర్డినేటర్ విజయసింహ, ఇన్‌చార్జి సిరాజ్, గౌస్, తిరుపతయ్య, ముక్రమ్, ఫయాజ్‌ఖాన్, యూసుఫ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.



బోరబండ సైట్–3లో రోడ్‌షోలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, నేతలు

### బస్తీల్లో గులాబీ శ్రేణుల ప్రచారం..

బోరబండ డివిజన్‌లోని బస్తీల్లో మాగంటి గోపీనాథ్‌కు మద్దతుగా పార్టీ నేతలు, బూత్ కమిటీల ప్రతినిధులు ప్రచారాన్ని ఉధృతం చేశారు. బుధవారం బూత్‌లవారీగా 30–40 మంది చొప్పున ఇంటింటికి వెళ్లి మాగంటి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహిళా నేతలు, కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొనడం విశేషం. బీఆర్ఎస్ ప్రచార హోరుతో వీధులన్నీ గులాబీమయంగా మారాయి. మాగంటి గెలుపే ధ్యేయంగా ప్రజల్లోకి వెళ్లి కేసీఆర్ సుపరిపాలన, గోపీనాథ్ చొరవతో బోరబండ అభివృద్ధి గురించి కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నామని డివిజన్ మహిళాధ్యక్షురాలు దేవమణి పేర్కొన్నారు.



బోరబండలోని బస్తీలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నేతలు



జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లు, నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

## గెలుపు ఖాయమే ..మెజార్టీపై దృష్టి పెట్టండి

### జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి గోపీనాథ్

### నేడు నామినేషన్ దాఖలు చేయనున్న మాగంటి

బంజారాహిల్స్,నవంబర్ 8: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గత పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ పట్ల ఉన్న ఆదరణను చూస్తుంటే రికార్డు స్థాయిలో మెజార్టీ రావడం ఖాయమని నియోజకవర్గం అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కార్పొరేటరు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం తీరును సమీక్షించారు. బూత్‌స్థాయిలో ఇంటింటి ప్రచారం జరుగుతున్న విధానం గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండటంతో ప్రతిబూత్‌లో ప్రజలతో నేరుగా సంబంధాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు నల్లేరు మీద నడక అనే విషయంలో అనుమానాలు అక్కర్లేదని, భారీ మెజార్టీ సాధించడంపైనే దృష్టి పెట్టాలని సూచించారు. నిరంతరం ప్రజల్లో ఉంటున్న పార్టీని కాకుండా ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే పార్టీలను, నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. గురువారం ఉదయం 11గంటలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నానని తెలిపారు. ర్యాలీ లేకుండా నేరుగా కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేస్తామని, కార్యకర్తలంతా ప్రచారంలోనే ఉండాలని సూచించారు. సమావేశంలో వివిధ డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు సంతోష్‌ముదిరాజ్, సంజీవ, కృష్ణమోహన్, ప్రదీప్, అప్పు, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, రామకృష్ణ, నజీర్, విజయసింహ, బసవరాజు, డా.అఫ్తాబ్ తదితరులు పాల్గొన్నారు.



## నాంపల్లి దర్గాలో మాగంటి ప్రార్థనలు

జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా బుధవారం నాంపల్లిలోని యూసుఫియన్ దర్గాను సందర్శించి ప్రార్థనలు చేయడంతో పాటు మొక్కులు చెల్లించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా నగరంలో జీవిస్తున్నారని. రానున్న ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, నాయకులు సంతోష్, నజీర్, షకీల్, సజ్జాద్, పహీమ్, చోటూ భాయ్ పాల్గొన్నారు. *– బంజారాహిల్స్, నవంబర్ 8*

## జూబ్లీహిల్స్‌కు 2 నామినేషన్‌లు..

జూబ్లీహిల్స్,నవంబర్8 : జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బుధవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. మజ్లిస్ మర్కజ్ ఈ సియాసి పార్టీ నుంచి కె.మురళీకృష్ణ, బీజేపీ నుంచి లంకాల దీపక్ రెడ్డి నామినేషన్‌లు వేశారు. బంజారాహిల్స్‌లోని షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీస్‌లో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.రవి నామినేషన్లు స్వీకరించారు. దీంతో జూబ్లీహిల్స్‌కు ఇప్పటివరకు 9 నామినేషన్లు దాఖలయినట్లయింది.

## వైద్యురాలిని మోసం చేసిన సైబర్ నేరగాళ్లు

వెంగళరావునగర్,నవంబర్ 8 : ఓ వైద్యురాలిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. ఈ ఘటనపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ...మధురానగర్ కాలనీలో నివాసం ఉండే డాక్టర్ ఎ.సీతాదేవి(74)కి అమెరికాలో ఉంటున్న ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ లక్ష్మి ఫ్రెండ్. ఇటీవల తనకు అర్జంట్‌గా డబ్బు అవసరం ఉందని లక్ష్మి పైరిట వాట్సాప్‌లో సీతాదేవి సందేశం వచ్చింది. నిజమేనని నమ్మి భూపేందర్ సింగ్ అనే వ్యక్తి బ్యాంక్ ఖాతాకు డబ్బును పంపింది. ఇటీవల మరో స్నేహితురాలు డాక్టర్ అరుణశ్రీ కలువగా తనకు కూడా అలాంటి సందేశం వచ్చిందని తెలిపింది. దీంతో సీతాదేవి అమెరికాలో ఉంటున్న స్నేహితురాలికి కాల్ చేయగా... ఆ సందేశం తాను పంపింది కాదని చెప్పింది. దీంతో మోసపాయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఎంఐఎం టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి..

జూబ్లీహిల్స్, నవంబర్ 8: ఎంఐఎం పార్టీ నుంచి టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నానని ఎంఐఎం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం యూసుఫ్‌గూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ..అసెంబ్లీ ఎన్నికలలో మజ్లిస్ నుంచి పోటీచేయాలని భావించానని.. ఆ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని వెల్లడించారు. ఈ మేరకు ఏఐఎంఐఎం పార్టీకి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల లో స్థానికేతరులు ఎక్కువ మంది పోటీలో ఉన్నారని.. సమస్యల పరిష్కారానికి స్థానికుడైన తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ యాదవ్

# మహిళల భద్రతకు పెద్ద పీట

### తెలంగాణ ప్రభుత్వం మహిళా పీఎస్‌ల ఏర్పాటు

### యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లో సేవలు..

### హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు..

జూబ్లీహిల్స్, నవంబర్ 8 : మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం నగరంలో మహిళా పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేయడంతో మహిళలకు మంచి రోజులొచ్చాయని చెప్పవచ్చు. వివాహానంతరం ఎదుర్కొనే సున్నితమైన సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తీవ్ర సంఘర్షణను ఎదుర్కొనే మహిళలకు ఈ పోలీస్ స్టేషన్లు అండగా నిలుస్తున్నాయి. మహిళల సమస్యల పరిష్కారానికి భరోసా కేంద్రాలతో పాటు ఇటీవల జోన్‌కు ఒకటి చొప్పున మహిళా పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లో వెస్ట్ జోన్ ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ సేవలందిస్తుంది. రాష్ట్రంలో 35 ఏండ్ల తరువాత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పోలీస్ స్టేషన్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొత్త మహిళా ఠాణాలు కొలువుదీరాయి. ప్రభుత్వ ఆదేశాలతో జీఓ నంబర్ 32 ప్రకారం ప్రతి జోన్‌లో మహిళా పోలీస్ స్టేషన్‌ల ఏర్పాటుకు నాటి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చొరవ తీసుకున్నారు. ఈ పోలీస్ స్టేషన్‌లలో మహిళలు, కుటుంబ సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు.. తగిన న్యాయ సలహాలు.. సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఇక్కడ మహిళా ఠాణాలు అందుబాటులో లేకపోవడంతో మహిళలు గృహహింస, వరకట్న వేధింపులు, కుటుంబ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పోలీస్ స్టేషన్‌కు రోజురోజుకూ మహిళల ఆదరణ పెరగడంతోపాటు సానుకూల వాతావరణంలో కేసులు పరిష్కారం అవుతుండటంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యూసుఫ్‌గూడ మహిళా ఠాణాలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాసబ్ ట్యాంక్, ఫిల్మ్ నగర్, మధురానగర్, బోరబండ, ఎస్ ఆర్ నగర్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్ల పరిధిలోని బాధితులు ఫిర్యాదులు చేయవచ్చు.




యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లో ఏర్పాటుచేసిన మహిళా పోలీస్ స్టేషన్

### మహిళలకు పూర్తి భద్రత..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగర పోలీస్ కమిషనర్ నేతృత్వంలో సేవలందిస్తున్న మహిళా పోలీస్ స్టేషన్‌లో మహిళలకు పూర్తి భద్రత కల్పిస్తున్నాం. యూసుఫ్‌గూడ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇప్పటి వరకు 80 కేసులకు పైగా నమోదు చేశాం. ఆయా బాధితులను పంజాగుట్టలోని కౌన్సె లింగ్ కేంద్రాలకు పంపించి సత్వర న్యాయ సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



– ఎల్. రాములు, ఇన్‌స్పెక్టర్, ఉమెన్ పోలీస్ స్టేషన్, యూసుఫ్‌గూడ